# నామజ్యోతి ఒక్కటే అజ్ఞాన, అంధకారములను దూరముగావించే ప్రకాశవంతమైన శక్తి

దుష్ట గుణములు వదలిన శిష్టుడగును
చింత వదలిన దొరకును చిత్తశుద్ధి
త్యాగ గుణమున్న స్వచ్ఛంద తత్వమబ్బు
మరువబోకుడు యిటువంటి మంచిమాట

ప్రేమస్వరూపులారా!

నాస్తి నాస్తి మహా భాగా కలికాల సమం యుగం
స్మరణాత్ చింతనాదేవ ప్రాప్తాహి పరమాం గతిః

పరమగతిని మనము పొందవలెనన్న ఈ కలియుగమున సులభమైన మార్గము ఒక్క భగవన్నామమే! ఇది కలియుగము. పరిపూర్ణ కల్మషముతో నిండిన యుగము. అశాంతిలోని ప్రశాంతి, ప్రశాంతిలోని పరంజ్యోతి, ఆ పరంజ్యోతియే పరమాత్మ స్వరూపమని; అశాంతియందే ప్రశాంతి, ప్రశాంతి యందే ప్రకాంతి, ప్రకాంతియందే పరంజ్యోతి అనే సత్యమును మనము విస్మరించరాదు. ఇంతటి అజ్ఞానముతో, యింతటి అంధకారముతో కూడిన యుగము మరి ఏ యుగముకూడ లేదు. ఇట్టి అజ్ఞాన, అంధకారములతో కూడిన ఈ కలియుగములో ఒకే ఒక సులభమైన మార్గముచేత ఆ అంధకారమును, అజ్ఞానమును దూరము గావించే ఒక శక్తి ప్రకాశిస్తూ వున్నది. అదే నామజ్యోతి.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యే గతి రన్యథా

నామస్మరణకంటె ఈ కలియుగమునందు మరొకటి రక్షించేదిగాని, జ్ఞానమార్గమున ప్రవేశపెట్టేదిగాని, దివ్యత్వములో ప్రవర్తింపచేసేదిగాని లేదు. ఒక గులాబి పుష్పమును మనము చూచినప్పుడు దాని అందమైన రంగు, సౌందర్యము, ఆనందభరితమైన సుగంధము మన



sri sathyasai vachanamrutam

హృదయములో చేరిపోతాయి. అదే పుష్పమును మనము ప్రత్యక్షముగా దర్శించినప్పుడు వాడిపోయిన దళములు, దాని యందుండిన ముండ్లుకూడను మనకు గోచరిస్తూ వుంటాయి.

**నామస్మరణ అత్యంత సులభమైన సాధనా మార్గము**

ప్రత్యక్షములో ఒక విధమైన గౌరవము, భయము, ఆందోళన మనకు ప్రారంభమవుతాయి. అదే విధముగానే భగవత్ రూపము దర్శించినపుడు మనకు వుండిన ఆందోళన, భయము నామమునందు వుండవు. నామము యధేచ్ఛగా స్మరించవచ్చు. నామము సర్వులకు కూడను లభ్యమయ్యే స్థానము. ఇది మధురాతి మధురమైన స్వరూపము. పాపి పరమాత్మను చెందుటకు వీలుకాక పోవచ్చునుకాని, పాపికూడా సులభముగా నామమును అందుకొనుటకు సాధ్యమవుతుంది. ఎట్టి మానవుడైనాకూడను అత్యంత సులభమైన ఈ నామమును పొందటానికి సాధ్యమవుతుంది. కొన్న వస్తువుకంటె కొనేధనము చాలా విలువైనది. ధనమును మనము సంపాదించినామంటే వస్తువులను ఏనాడైనా ఎప్పుడైనా మనము పొందవచ్చును. అదేవిధముగా ఈ నామ ధనమును మనము సంపాదించుకున్నామంటే రూపమనే వస్తువును ఎప్పటికైనా మనము సాధించవచ్చు. ఈ నామ ధనమును సంపాదించుకునే విధానమును మనము నిత్యము కొన్ని విధములైన ఆచారములతో అభివృద్ధి గావించుకోవచ్చును. కొందరు యోగమును, కొందరు ప్రాణాయామమును, కొందరు యజ్ఞములు, కొందరు మరికొన్ని విధములైన సాధనలు సలుపుతూ వుంటారు. ఈ యోగ, యజ్ఞ, ప్రాణాయామములయొక్క మార్గములు అడుగడుగునకూడను, మెట్టుమెట్టునకూడను కొంత జారిపడుటకు అవకాశము వుంటుంటాది. ఇన్ని చేసియుకూడను ఫలమును పొందుదుమా లేదా అనే సందేహము మనయందు వదలకుండా వుంటుంది. ఎట్టి యోగములు, ఎట్టి ప్రాణాయామములు, ఎట్టి యజ్ఞములు, ఎట్టి తపస్సులు చేయక పోయినప్పటికి ఈ అన్నింటియందును వున్న ఫల స్వరూపము ఈ ఒక్క నామస్మరణచేతనే పొందవచ్చును. ఇట్టి పవిత్రమైన నామతత్వాన్ని, నామ మహిమను మనము కొంతవరకు గుర్తించటానికి ప్రయత్నించాలి.

**నామముచేత నామిని పొందవచ్చు**

నామముచేత నామిని సులభముగా పొందటానికి వీలవుతుంది. భగవన్నామాన్ని

srisathyasaivachanamrutam

గుర్తించటానికి సర్వులకు సాధ్యము కాదు. మనము ఒక కొత్త వ్యక్తిని చూడాలనుకున్నప్పుడు అతనియొక్క గుర్తులు, అతనియొక్క రూపము మనకు అనుభూతిలో ఉండవు. అతని నామము మాత్రమే మనము కొంతవరకు జ్ఞప్తి యందుంచుకున్న ఏనాటికైనా ఆ వ్యక్తిని మనము చూడటానికి సాధ్యమవుతుంది. కనుకనే నామముచేత ఎంత లభ్యము కానటువంటి తత్త్వమునుకూడను లభ్యము గావించుకోటానికి వీలుంటుండాది. కాశీలో మహాతత్త్వవేత్త, మహాజ్ఞాని, వేదాంతశిరోమణి అయిన ఒక వ్యక్తి వుండేవాడు. ప్రకాశనందిని. ఇతడు వేద వేదాంగములన్ని చదివి మహా గొప్ప విద్వాంసుడని పేరుపొందాడు. కాశీ క్షేత్రమునకే విఖ్యాతి గాంచాడు. కట్టకడపటికి ఈ విస్తృత గ్రంథ పరిచయముచేత తన హృదయాన్ని పూర్తి కల్మషము గావించుకున్నాడు. కేవలము వాక్యములు మాత్రమే తప్ప అనుభూతులు ఏమాత్రముకూడను లేవు. ఆచరణ అంతకంటె లేదు. అయితే ప్రాకృతమైన దృశ్యములోపల తనకంటె గొప్పవాడు లేదని ప్రఖ్యాతిని గాంచాడు. కడపటికి తన స్వంత శిష్యులచేతనే పరాభావము పొంది యిందులో ఏమాత్రము సరైన సారము, శక్తి లేవని గుర్తించి, ఆనాటినుండి నామస్మరణను ప్రారంభించుకున్నాడు. ప్రేమ ఏ విధముగా ఆవిర్భవిస్తుంది? నామముచేతనే ప్రేమ మనలో ఆవిర్భవిస్తుంది. ఈ ప్రేమయే పరమాత్మునికడకు గొనిపోతుంది. ఈ ప్రేమలో మునిగిన మానవునకు ఏ ప్రమాదముకూడను వుండదు. గంగలో నిల్చిన మానవుని తీక్షణమైన సూర్యకిరణములు ఏమాత్రము బాధించవు. గట్టున వున్నవానినే ఈ కిరణములు బాధిస్తుంటాయి. పరిపూర్ణ ప్రేమలో మునిగిన మానవుని మాయా శక్తులు ఏ మాత్రము బాధించవు. ప్రేమకు దూరమైన వ్యక్తిని మాత్రమే మాయ బాధిస్తుంది. కనుక ఈ నామస్మరణద్వారా మనము ప్రేమతత్త్వాన్ని అభివృద్ధి గావించుకోవాలి.

**నామస్మరణ మానవుని విశాలతత్త్వముగల వ్యక్తిగా రూపొందిస్తుంది**

ఈ ప్రేమతత్త్వముచేత అనేక విధమైన శక్తులుకూడను మనయందు ఆవిర్భవిస్తాయి. ప్రేమను పెంచుకోటంచేత రాగద్వేషములు మనలో నశించిపోతాయి. రాగద్వేషములు మనలో నశించినప్పుడు శాంతి చేకూరుతుంది. ఈ శాంతము చేతనే మనము సర్వసౌఖ్యములు అనుభవించవచ్చును. మూడంతస్తుల మేడపైన కూర్చున్నవాడు చుట్టూ ఎన్ని ఘోరమైన పులులు, సింహములు తిరుగాడుతున్నప్పటికి ఏమాత్రము భయపడడు. ఈ ప్రపంచమంతయు

srisathyasaivachanamrutam

క్రూర మృగములతో నిండిన దట్టమైన అడవివంటిది. కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యములనే మృగములు సర్వత్రా సంచరిస్తూనే వుంటాయి. ప్రేమ, నామము, విశ్వాసము అనే మూడంతస్తుల భవనములోపల మనము ప్రవేశించినామంటే ఈ మృగముల బాధ మనము ఏ మాత్రము అనుభవించము. విశ్వాసము అత్యవసరము. విశ్వాసములేనివానికి ప్రేమ అర్థము కాదు. ఈ ప్రేమచేతనే దివ్యత్వాన్ని ఎంతైనా మనము సాధించవచ్చును. కలియుగ ప్రభావమువలన ఈ ప్రేమకు మనం అత్యంత దూరములో జీవిస్తున్నాము. నాది, నావారు అనే తుచ్ఛమైన, సంకుచితమైన స్థానమువరకే ప్రయాణము చేస్తున్నాము. మానవులందరు ఒక్కటే అనే విశాలమైన భావమును విస్మరిస్తున్నారు. బాహ్యమైన సాధనలే ఈ విధంగా భ్రమిస్తూ వుంటాయి. ఈ నామస్మరణకూడను కృత్రిమమైన నామస్మరణగా artificialగా చేయకూడదు. పరిపూర్ణనమ్మకముచేత, పరిపూర్ణమైన ప్రేమచేత, పరమాత్ముని పొందాలనే అభిరుచిచేత నామాన్ని మనము వుచ్చరించాలి. నామములో లేని శక్తి మరొకదానిలో కనుపించదు. కనుక నామస్మరణ అనేది మానవుని విశాలమైన వ్యక్తిగా రూపొందింపచేస్తుంది. నామము చేస్తూ చేస్తూ తాను జగత్తులోనే లీనమైపోతాడు. జగత్తుకూడను తనలో లీనమై పోతుంది. ఈ జగత్తే మాతృస్వరూపిణి. పురుషుడనేది భక్తి స్వరూపిణి. ఈ రెండింటి సన్నిహిత సంబంధ బాంధవ్యముచేతనే మానవత్వమనే దివ్యత్వము మనకు ప్రాప్తిస్తూ వచ్చింది. దేహమనే పురములో శయనించినవాడే పురుషుడని అర్థము. దీనికి స్త్రీ, పురుష లింగ భేదములు లేవు. ప్రకృతంతయు స్త్రీ స్వభావమే! దుఃఖము వస్తే స్త్రీ ఏడుస్తుంది, పురుషుడు కూడా ఏడుస్తాడు. ఆకలైతే పురుషుడు భుజిస్తాడు, స్త్రీ భుజిస్తుంది. కోపతాపములచేత పురుషుడు వుద్రేకుడౌతాడు, స్త్రీలు వుద్రేకులౌతారు. ఈ గుణములు యిరువురి యందును సమముగానే వుంటున్నవి. పురుషత్వమునకు తగిన ప్రత్యేకమైన గుణము వీరియందు ఏమిటున్నది? కేవలము లింగభేదమేగాని గుణభేదములుగాని, వ్యక్తిభేదములుగాని, మానసికభేదములుగాని వీరియందు కానరావు. కావున, అందరుకూడను స్త్రీ స్వరూపులే! ప్రతి మానవునియందు బలహీనత వుండటంచేత యితను కూడను అబలుడే! కనుకనే ఈ అబలత్వమైన మానవత్వానికి దివ్యత్వమైన బలముతో కూడిన శక్తి అందరియందు ఆవిర్భవింపచేసుకోవాలి.

sri sathyasai vahini.org

## ఆచరణ లేని విద్యలు వ్యర్థములు

ముఖ్యముగా మానవుడు గుర్తించవలసినది ప్రతి విషయమునందుకూడను తనను తాను పోల్చుకొనుటకు ప్రయత్నించాలి. ఈ పోలికయే భూజాతయైన సీత రావణునకు బోధించినది. ఆమె భూజాత, ఆమెయే సీత, ఆమెయే ప్రకృతి స్వరూపిణి. ఇట్టి ప్రకృతి స్వరూపిణియైన సీతను అనేక విధములైన భ్రాంతులచేత రావణాసురుడు పొందుటకు ప్రయత్నించాడు. ఒకానొక దినము ఆమెను సమీపించి తన శక్తి, సామర్థ్యములు, వైభవములను గురించి ఆమె యెదుట అనేక విధములుగా వర్ణిస్తూ వచ్చాడు. "నేను గొప్ప విద్యావంతుడను, అరువది నాలుగు విద్యలు చదివినవాడను, గజకర్ణ, గోకర్ణవిద్యలనుకూడా చదివినవాడను. పక్షిభాష, మృగభాష కూడను తెలిసినవాడను," అని అనేక విధములుగా తనను తాను వర్ణించుకుంటూ కూర్చున్నాడు. అప్పుడు సీత "రావణా! నీ తుచ్ఛ విద్యలు, నీ తుచ్ఛ శక్తులు నా భర్తముందు తక్కువగా కనిపిస్తాయి. ఒక్క విషయాన్ని నీవు చక్కగా గుర్తించినవాడవౌతే సర్వవిద్యలు తెలుసుకున్నవాడవౌతావు. నీ భార్య మండోదరినే పర పురుషుడు అపహరించినప్పుడు నీ మనస్సు ఏ రీతిగా వుంటుందో యోచించుకో"మంది. "పర స్త్రీని నీవు అపహరించినప్పుడు ఆ పురుషుడు ఎన్ని బాధలకు గురౌతాడో, ఎన్ని విధములైన దుఃఖములకు గురౌతాడో నీవు కొంత యోచించుకున్నావా? ఇతరులు నిన్ను ఏ రీతిగా గౌరవించాలని భావిస్తావో నీవు మొట్టమొదట ఆ రీతిగా ఇతరులను గౌరవించటానికి ప్రయత్నించాలి. ఇతరులు ఏది చేస్తే మంచిదని నీవు భావిస్తావో ఆ మంచిని నీవు మొట్టమొదట వారికి చేసి చూపించాలి. కేవలము నీయొక్క స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తమై నీ అహంకారముచేత ఈ విధముగా వర్ణిస్తున్నావేగాని పరులయొక్క మంచి చెడ్డలను నీవు ఏమాత్రము గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. తన దోషములను కప్పిపుచ్చుకొని, పరులలో లేని దోషములను నీవు అభివృద్ధి గావించటానికి ప్రయత్నిస్తున్నావు. ఆత్మ విద్యకు యిది విరుద్ధమైనది. యితరులకు కష్టము కలిగినప్పుడు మొట్టమొదట దానిని తన కష్టముగా భావించుకోవాలి. తనకు నష్టములు సంభవిస్తే తాను ఏ విధమైన దుఃఖానికి గురౌతాడో అదేవిధముగా యితరులకు కష్టము కలిగినప్పుడు వారుకూడా అటువంటి దుఃఖమునకు గురౌతారనే భావము నీవు అభివృద్ధి గావించుకోవాలి. అట్టి విచక్షణాశక్తి లేని నీ విద్యలన్నికూడను తుచ్ఛమైన విద్యలు. కేవలము

sri sathyasai vachanamrutam

భౌతికమైన విద్యలేగాని యివి సరైన విద్యలు కావ"ని బోధించింది. అంతేకాదు, ఆమె రావణునికి మరొక విషయముకూడా చెప్పింది, "రావణా! నేను కేవలము ఒకరికి మాత్రమే కాదు మాతృదేవిని, జగత్తుకే మాతృదేవిని, నీకు కూడను తల్లితో సమానురాలను. అట్టి మాతృమూర్తిని ఈ విధముగా హింసించటము నీకు న్యాయము కాదు. నీ విద్యలకు సరైన గౌరవము కాదు."

ఈ సత్యాన్ని అంతకుముందే గుర్తించిన హనుమంతుడు రావణుని సమీపించినప్పుడు అతనికి ఈ మాతృదేవియొక్క తత్త్వాన్ని బోధిస్తున్నాడు :

**లోకమునకు తల్లిరా ఈ సీతమ్మ నీకు చూడగ తల్లేరా**
**లోక మాతను దెచ్చి యిప్పుడు పాతకము నొడిగట్టుకొంటివి**
**ఏక శరమున నీదు శిరములు, ఏకమారుగ ద్రుంచు రాముడు**
**బుద్ధి చెప్పెద రావణా, ఈ లంక నీకింక లేదుర దుర్గుణా!**

**సీతతో సంభాషించితి రాముల ముద్దుటుంగర మందించితి**
**పాతకుడని వనము గాచిన బడుగు రాక్షసుల చంపితి**
**కోతినంచు నాతో పోరి రాచపురికాయు రాక్షసులు**
**బుద్ధి చెప్పెద రావణా యీలంక నీ కింక లేదుర దుర్గుణా!**

కట్టకడపటికి ఒక్కటి మాత్రమే చెప్పాడు:

**నీ పది తలలు వూడే తీరు నీవిప్పుడు చేసె దర్బారు చూడు**
**యిది కదా నేను చూడవలెనని యింద్రజిత్తుచేత చిక్కితి**
**పదే పదే నీకేల చెప్పుదు ప్రాణములు నీసొమ్ము కాదురా**
**బుద్ధి చెప్పెద రావణా యీ లంక నీకింక లేదుర దుర్గుణా!**

ప్రాణము నీ చేతిలో లేదు. పరమాత్మ చేతిలో వుంటున్నాది. నేటికైనా గుర్తించుకొని పరమాత్ముని ప్రార్థించు. పరమాత్ముడు ఎక్కడ వున్నాడని సందేహము నీకక్కర లేదు.

సర్వత్రా వుండిన పరమాత్ముని నీవు గుర్తించాలంటే సర్వశక్తిమయమైన నామాన్ని నీవు వుచ్చరించమన్నాడు. ఒక్క నామము నీవు వుచ్చరిస్తే సర్వము నీవు అనుభవించినవాడవౌతావు.

sri sathyasai vahini amrutam

వృక్షముయొక్క వేళ్లకు నీరుపోస్తే కొమ్మలు, రెమ్మలు, కాయలు, ఫలములు పోషించినవాడవౌతావు. యీ జగత్తునకు నామమే ఒక బీజము. ఈ నామమనే బీజమునుండి జగత్తనే వృక్షము ఆవిర్భవించింది. ఈ జగత్తనే వృక్షములోపల అనేక విధములైన భ్రాంతులనే పత్రములంతాకూడను ఆవిర్భవించాయి. ఇందులో మన సంకల్పములనే పువ్వులు పూస్తున్నాయి. ఆ పుష్పములే కాయలనే రూపాన్ని ధరిస్తున్నాయి. ఆ కాయలే జీవులు. ప్రతి కాయయందుకూడను తిరిగి ఈ విత్తనము చేరి వుంటున్నాది. పూడ్చినది ఒక విత్తనమే! ఎన్ని కాయలు కాచెనో అన్ని విత్తనములు అందులో ప్రవేశిస్తున్నాయి. దీనినే భగవద్గీతయందు "బీజంమాం సర్వభూతానాం" అన్నాడు కృష్ణపరమాత్మ. "నామ స్వరూపమైన నా బీజమే సర్వుల హృదయములోకూడను నామస్వరూపమైన విత్తనముగా రూపొందుతున్నది" అని ప్రకటించాడు. ఒక్క విత్తనము యిన్ని విత్తనములుగా ఏ రీతిగా మారినాయి? అదే "ఏకోహం బహుస్యాం ప్రజాయేయేతి" అని. ఒకరే అనేక రూపములు ధరిస్తూ వచ్చాడు. ఈనాటి మానవులు అనేక గ్రంథములు పఠిస్తున్నారు, అనేక రచనలు వ్రాస్తున్నారు, కాని సత్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

**సకల శాస్త్ర పురాణ సంగ్రహవేత్తయై**
**వేదాంత వేద్యుడౌ విబుధుడైన**

ఏ విధమైన విప్రత్వము వారు పాటించినప్పటికిని ఆచరణ అత్యవసరమైనదనే సత్యాన్ని విస్మరిస్తున్నారు. ఆచరణ లేని విద్యలు వ్యర్థములు. ఏ కించిత్తైనాకూడను ఆచరించటానికి ప్రయత్నించాలి.

**నిత్య జీవితములో అనిత్యములైన సంపదలు, భోగభాగ్యములను అనుభవిస్తూకూడ సర్వమూ భగవత్ప్రసాదములేనని భావించాలి**

దివ్యాత్మ స్వరూపులారా! అనేక విధములైన గ్రంథములు పఠించి మనము కాలము వ్యర్థము చేయనక్కరలేదు. ఒక్క చిత్తశుద్ధిచేత పరమాత్ముని నామము చేయండి. ఆ నామముచేతనే మనము సర్వ విధములైన ఆనందమును అనుభవించవచ్చు. నీ నిత్య జీవితములో అనిత్యమైన పదార్థములను నీవు అనుభవించవచ్చు. అవి అనుభవిస్తూ కూడను అవి భగవంతుని శక్తులే,

sri sathyasai vachanamrutam

భగవంతుని యొక్క ఇష్టములే అనే సత్యాన్ని మనము విస్మరించరాదు. ఒక చిన్న ఉదాహరణము. ఒక పశులకాపరి గ్రామములోనివారి పశువులన్నీ తోలుకు వెడతాడు. పచ్చని బయళ్లలోపల వాటిని వదలిపెడతాడు. అటువంటి ఆ కాపరి పిల్లలంతా ఒక వృక్షము క్రిందచేరి కూర్చొని "నా ఆవుకు జబ్బు చేసింది, నా ఆవు తప్పించుకు పోయింది, నా ఆవు యీనుతుంది," ఈ విధమైన పదములచేత ఆ ఆవులు అన్నిటిని తమయొక్క ప్రోపరిటీగా తాము భావిస్తూ వుంటారు. ఈ విధంగా నా ఆవు, నా పశువు అని అనుకోటంచేత వారికి ఏమీ నష్టముగాని, ఆదాయముగాని లేదు. వారికి మొదలే తెలుసు ఈ ఆవు ఫలాని వారి ఆవు అని. దాని యజమాని వేరనికూడను తెలుసు. దీనియొక్క యజమాని మరొకడు కలడని విశ్వసించి తనచేతిలో వుండినంతవరకు మాత్రమే ఇది నాది అనే సంబంధము అభివృద్ధి పరచుకుంటాడు. అదేవిధముగా మనము ఈ జగత్తులోపల ఈ నా బిడ్డ, నా భార్య, నా భర్త, నా కుమారుడు అనే సంబంధములను ఉపయోగించుకోవచ్చు. కాని, దీనిద్వారా ఏ విధమైన దుఃఖముగాని, ఆనందముగాని ఏమాత్రముకూడను అనుభవించకూడదు. "అందరూ భగవంతుని బిడ్డలే! అందరూ ఆయన అనుగ్రహించిన ప్రసాదములే!" అని దైవభావముచేత దీనిని పరిపూర్ణముగా భావించుకున్నామంటే ఏ దుఃఖముకూడా మనలో ప్రవేశించుటకు అవకాశము వుండదు. నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించుకుంటూ ఈ విధమైన భావములు నీవు అభివృద్ధి గావించుకోవాలి.

**భగవంతునికి పరిపూర్ణముగా తన్ను తాను అర్పించుకోవాలి**

ఈనాడు తల్లి ప్రేమ, తండ్రి ప్రేమ, బంధు ప్రేమ అనేది ఒక విధమైన వ్యాపార రంగముగా అనుభవిస్తున్నారు. భగవంతునికి అర్పితమని చెప్పిన కేవలము సంపూర్ణముగా అర్పితము గావించాలి. కొంతనీది కొంతనాది అని చెప్పి భగవంతుని ఈ Partnership business లోపల ప్రవేశపెట్టకూడదు. ఈ పార్టనర్‌షిప్ లోపల అతను ప్రవేశించడు. ద్రౌపదికూడను ఒక చేతితో తన చీరను గట్టిగా పట్టుకొని 'హే! కృష్ణా! కృష్ణా!' అని మరొక చేతితో పిలుస్తూ వచ్చింది. ఈ దృశ్యాన్ని గుర్తించాడు కృష్ణుడు. కేవలము పార్టుటైమ్ డివోషన్‌గా వుంటుందాది, ఈమె భక్తి. అర్ధము తనయందు, అర్ధము నాయందు వేస్తున్నాది. ఈ బిజినెస్‌లో నేను ప్రవేశించకూడదు. చేస్తే పూర్తి నాకర్పితము చేయాలి. లేక పూర్తి తాను భరించాలి అని నిర్ణయించుకున్నాడు. ఎంతసేపు ఆమె యింకా ప్రయత్నిస్తుంది! విసుగు పుట్టింది. మనసులోని తత్త్వాన్ని బాగా

srisathyasaivachanamrutam

గుర్తించింది. "నేనా రక్షించుకునే దానను, భగవంతుడే నన్ను రక్షించాలి" అని "హే కృష్ణా" అని రెండు చేతులు కలిపింది. ఆ రెండు కలపటంచేత ఏమై పోయిందంటే తనయొక్క దశేంద్రియములు పరమాత్మకు అర్పితము చేసినట్టుగా అయిపోతుంది. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు రెండు చేరినప్పుడు ఈ దశేంద్రియములు పరమాత్మునికి అర్పితము గావించింది. అప్పుడు వచ్చి రక్షించాడు, పరమాత్ముడు. సర్వసంగ పరిత్యాగవే సర్వేశ్వరునియందు భక్తికి ప్రధానలక్షణము. గజరాజుకూడను అట్లనే! చాలకాలము ప్రార్థించాడు. ఏ విధముగా ప్రార్థించాడు? ఆ గట్టుపైన వున్న చెట్టుకు తన తొండముతో చక్కగా గట్టిగా పట్టుకొని "రావే, ఈశ్వరా!" అన్నాడు. ఒక వంక తన తొండముచేత చెట్టును గట్టిగా పట్టుకొని 'రావే ఈశ్వర' అంటె ఏ రీతిగా వస్తాడు? తన తొండముపైన తాను భారము వేసుకున్నాడు. ఆ తొండమే తన్ను రక్షిస్తుందని విశ్వసిస్తున్నాడు. మధ్యలో 'రావే ఈశ్వరా' అని పిలుస్తున్నాడు. ఇటువంటి సగం సగం వ్యాపారములో నేను చేరకూడదనుకున్నాడు. ఇంతలో గజరాజు శక్తి పూర్తిగా క్షీణించింది. కడపటికి ఆ చెట్టునుకూడా వదలిపెట్టి 'రావే ఈశ్వరా' అని తొండమెత్తి పిలిచాడు. అప్పుడు భగవంతుడు పరుగెత్తి వచ్చాడు. నిజానికి, భగవంతుడు రావటము, పోవటము అనేది వేరుగా లేదు. భగవంతుడు ఎక్కడ చూచినా వుంటున్నాడు. మన దృష్టి అతనిపై లగ్నమైనప్పుడు అతని దృష్టి మనపైన పడుతుంది. అదే సుదర్శన చక్రము పంపాడని మన పురాణములలో రాస్తుంటారు. సుదర్శనమనగా అదొక చక్రము కాదు సు-దర్శనము 'మంచి చూపు.' నీ చూపు భగవంతునిపైన పడినప్పుడు భగవంతుని చూపు నీపైన పడుతుంది. నీ చూపు భగవంతునిపైన పడకుండినంతవరకుకూడను భగవంతుని చూపు నీపైన పడదు. భగవంతుడు సర్వత్రా వుంటున్నాడు. అయితే నీ భావము అతనిపైన ప్రవేశపెట్టాలి. దానికి ఒక్క నామమే ప్రధానమైన సాధనము.

**నామమునకు ప్రేమ జతపరచినప్పుడే అది పవిత్రమైన నామస్మరణ అవుతుంది**

నామస్మరణచేత భగవంతుని అనుగ్రహమును పొందుటలో ఏమాత్రము సందేహము లేదు. ఈ నామరాజ్యమునందు, ప్రేమరాజ్యమునందు మోక్షమునకు ఏమాత్రము విలువ లేదు. ఈ ప్రేమరాజ్యములోపల మోక్షము చాలా చిన్నక్లాసుకు చేరినది. ఏమిటీ మోక్షము?

srisathyasaivahini

మోహక్షయము కాకుండా మోక్షము లభించాలంటే లభిస్తుందా? కాలినుండి తలవరకు మోహమును పెంచుకొని మోక్షము కావాలంటే యిది భగవంతుని మోసము చేసినట్టే అవుతుంది. నీ మోహమును క్షయము గావించుకో! అప్పుడే అష్టైశ్వర్య స్వరూపుడు నీకు ప్రత్యక్షమవుతాడు. చేయవలసిన పనులు చక్కగా చేయక తలచవలసిన భావములు సరైన రీతిగా తలచక, దివ్యత్వమంటే ఏమిటో అర్థముకాక సంతోషము పొందాలంటే ఏరీతిగా పొందగలవు? తుకారాం చెప్పాడు, "రత్నముయొక్క విలువ తెలిసినవాడే దానిని భద్రము చేసుకుంటాడు" అని. ఆ రత్నము విలువ తెలియనివాడు ఎక్కడైనా పారవేసుకుంటాడు. కనుక మొట్టమొదట ఈ నామరత్నముయొక్క విలువ మనము గుర్తించుకోవాలి. నామ మహిమ సామాన్యమైనది కాదు; సకల శాస్త్రములను మథించి అందించిన సుధానిధి, ఈ నామము. మనం శాస్త్రములను, పురాణములను చదవకపోయినప్పటికి ఒక్క నామమునందు పరిపూర్ణమైన విశ్వాసము పెట్టి నిరంతరము ఆ నామాన్ని జపిస్తూ స్మరిస్తూ వుండినామంటే యింతకంటె సులభమైన సాధన మరొకటి లేదు. అయితే ఈ నామ జపము కృత్రిమమైన నామముగా టేపురికార్డు మాదిరి మనము వుచ్చరించరాదు. టేపురికార్డులో నామము వుంది, కాని నామము వినాలంటే ఏమి చేయాలి? కరెంటు దానికి అతికించాలి. ఆ ప్లగ్‌లో పెట్టినప్పుడే ఈ టేపు పాడుతుంది. తద్వారా మనము మాట వినగలుగుతాము. టేపులో పాటలున్నాయని చెప్పి టేపును ముక్కలు ముక్కలు చేసినాగాని ఒక్క శబ్దమైనా మనకు వినిపించదు. భగవన్నామమనే ఒక పెద్ద టేపు మన హృదయములోనే వుంటున్నాది. ఆ నామము ప్రేమకు అతికించినప్పుడే యిది పవిత్రమైన భావముతో వుచ్చరిస్తుంది. హృదయము నుండి ఆవిర్భవించాలి. హృదయమునుంచి కాక, పెదవులనుండి వచ్చిన నామమునకు టేపురికార్డుకు ఎంత ఫలితమో నీకు అంతే ఫలితము వస్తుండాది. ఈనాడు అంతా కూడను, మనము ఆచరించే సర్వకర్మలుకూడను ఈ విధముగా కృత్రిమముగానే రూపొందుతున్నాయి. కనుకనే ఈ భౌతికమైన జీవితములో, ఐహికమైన లోకములో, మన నిత్య జీవితములో ఏ విధముగా ప్రవర్తించాలో ఆ ప్రవర్తనను మనము చక్కగా గుర్తించుకుంటే యిదే నిజమైన సాధన. కానీ ఆ ప్రవర్తనలోనే దోషములు బయలుదేరుతున్నాయి.

**నీతి, నిజాయితీలు లేకుండా ఎన్ని ఆడంబరాలు చేసినా అది భగవంతుని తృప్తి పరచదు**

మొట్టమొదట ప్రతి వ్యక్తికూడను తన తల్లిదండ్రులను గౌరవించాలి. అదే నిజమైన గమ్యమునకు మార్గము. అదే మిమ్ములను ధన్యము చేస్తుంది. ఇలాంటి పవిత్రమైన మార్గములో ప్రవేశించి దానిని సరైన రీతిగా మనము అనుభవించినప్పుడే ఈ దైవత్వముయొక్క ఆనందము మనము గుర్తించిన వారమవుతాము. బ్రతికినంతకాలము తల్లితండ్రులకు యింత పిడచైనా పెట్టక చచ్చిన తరువాత ఈ యొక్క ఎముకలు, భస్మము తీసుకొని కాశీకి బయలుదేరుతున్నాడు, ఈనాటి కుమారుడు. బ్రతికినప్పుడు అన్నము పెట్టలేని కుమారుడు అస్తికలు గంగలో కలపటానికి వెడుతున్నాడు. ఇది ఎంత కృత్రిమమైన యుక్తి! చచ్చిన తరువాత లారీలు లారీలు పుష్పములు వేసేదానికంటె బ్రతికినప్పుడు ఒక చిన్న పుష్పముతో నీ తల్లిని పూజించు. బ్రతికినంతకాలము కంటినీరు కార్పించుచు చచ్చిన తరువాత తద్దినాలు పెట్టుకుంటే మనకు వచ్చిన ఫలితమేమిటి? తత్ దినము, ఈ తద్దినము.

**సద్భక్తులందరు చేరి భగవంతుడాయంచు**
**చెవుల కింపుగ నుతి చేయు దినము**
**బీదల వెతలన్ని ప్రీతితో తొలగించి**
**అన్నదమ్ముల మాడ్కి నున్నదినము**
**దైవచింతన చేయు దాస బృందములకు**
**ప్రీతి మృష్టాన్నము పెట్టుదినము**
**మహనీయుడెవరైన మనకడ కేతెంచి**
**చెలిమి భగవత్కథలు చెప్పుదినము**

ఆ దినము దినముగాని తక్కినవన్నీ తద్దినాలే! తద్దినములు అనగా ఏమి? భగవంతుని మరచిన దినమే తద్దినము. జీవితంలో ఎన్నో సంఘటనలను మనము స్మరించుకుంటున్నాము. ఆ యొక్క తల్లి, తండ్రిని స్మరించుకుంటూ ఆ దినములో హృదయ పూర్వకముగా ఒక చుక్క కంటిధార కారుస్తే యిదే తర్పణము. అట్టి నిజమైన తర్పణములు వదలక మనకు ఏనాడు వడలు, పాయసము యిష్టమవుతుందో ఆనాడంతా తద్దినాలు పెట్టుకుంటున్నాము. ఇది మనకు మనం పెట్టుకుంటున్నాముగానీ పోయినవారికి కాదు పెట్టేది. ఈ విధమైన దురాచారములు జగత్తులో ఈనాడు అభివృద్ధిగావటంచేతనే నిజమైన భక్తి ప్రపత్తులంతా

srisathyasaivachanamrutam

అడుగంటి పోతున్నాయి. తల్లితండ్రులను సరైనరీతిలో మనము గౌరవించాలి. పెద్దలను సరైన రీతిలో మనము ఆహ్వానించాలి. అప్పుడే మన జీవితములో నీతి నిజాయితీలు పెరుగుతాయి. నీతి నిజాయితీలు లేకుండా ఎన్ని రకములైన ఆడంబరాలు మనము ఆచరించినా ఇది భగవత్ తృప్తి కానేరదు. అందువలన అహంకార, ఆడంబరాలు మనము త్యజించాలి. ఆత్మ తత్వాన్ని విశ్వసించాలి. అమ్మనాన్నలను ప్రేమించాలి. ఇదే నిజమైన భక్తికి మార్గము. తల్లి ప్రేమకే గురికానటువంటివాడు దైవప్రేమకు ఏ రీతిగా గురౌతాడు? భగవంతుడు అందరియందు వుండినప్పటికిని తల్లితండ్రులయందు ప్రత్యేకంగా దివ్యత్వమును మనము అనుభవించటానికి ప్రయత్నించాలి.

**సర్వులయందు దేవుడున్నాడనే విశ్వాసమును బలపరచుకోవాలి**

కనుక, కృత్రిమమైన మార్గములో మనము ప్రవేశించక మానవులమై పుట్టి విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞానములతో విలసిల్లి ఈ అజ్ఞానములో పడిపోవటముకంటె అజ్ఞానము మరొకటి లేదు. లోకముయొక్క పేరు ప్రతిష్టలకై మనము ఏ మాత్రము పాటుపడరాదు. రూపనామములతో పుట్టిన దీనికి విలువిచ్చి శాశ్వతమైన సత్‌చిత్ ఆనందములను విస్మరిస్తున్నాము.

**పోకన్మానదు దేహము ఏ విధమున పోషించి రక్షించినన్**
**రాకన్మానవు హాని వృద్ధులు మహారణ్యమున్ దాగినన్**

వచ్చేవి వస్తున్నాయి. పోయేవి పోతున్నాయి. అవి మనవి కాదు, మనది అనేది ఒక్కటే! అదే సత్ చిత్ ఆనందము. ఈ ఆనందమును మనము భద్రముగా కాపాడుకోవాలి. అదే మన ప్రధానమైన కర్తవ్యము, సర్వులయందు దేవుడున్నాడనే విశ్వాసము మనము బలపరచుకోవాలి. ఒక్క నామతత్వాన్ని బలపరచుకోవాలి. ఈ నామముచేతనే దైవము మనకు లభ్యమవుతాడు. కనుక, నామ సంకీర్తనముచేత మనయొక్క దివ్యత్వాన్ని మనము గుర్తించి పవిత్రమైన ఆత్మతత్వాన్ని అనుభవించి జగత్తునందు ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపటానికి ప్రయత్నించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ. 16-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam